# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 3 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 4-4 -2025 | వెల : .రూ. 5.00




## బీసీ గర్జనకు రాహుల్ వస్తాడని చెప్పలేదు

- అయినా కాంగ్రెస్ అగ్రనేత మద్దతు ఉంది
- ఢీల్లీ బీసీ గర్జాన సభపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

హైదరాబాద్,ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారిన బీసీ రిజర్వేషన్లపై టీపీసీసీ నేత మహేష్ గౌడ్ స్పందించారు. రాహుల్ గాంధీ బీసీ గర్జనకు హాజరవుతారని కాంగ్రెస్ ఎప్పుడు ప్రకటించ లేదని స్పష్టం చేశారు. వక్ఫ్ బిల్లుతో సంబంధం ఉన్న అంశాల కారణంగా రాహుల్ గాంధీ ఈ కార్యక్రమానికి రాలేకపోయారని తెలిపారు. అయితే, బీసీ రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీ పూర్తి మద్దతు ఇస్తారని హామీ ఇచ్చారు. అలాగే హైదరాబాదులోని సెంట్రల్ వర్సిటీ భూములపై ఇటీవల

-మిగతా 2 లో



## ఒక్క చెట్టు.. నరికేయొద్దు



### హెచ్‌సీయూ భూములపై సుప్రీంకోర్టు ఆర్డర్

- చెట్ల నరికివేతపై ధర్మాసనం సీరియస్
- ఆ భూములను పరిశీలించి రిపోర్టు ఇవ్వాలి..
- చట్టాన్ని ఎలా చేతుల్లోకి తీసుకుంటారు
- ఎలాంటి పనులు చేపట్టవద్దన్న సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)
కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. సుమోటాగా కేసు స్వీకరించిన ధర్మాసనం.. ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దంటూ స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.

-మిగతా 2 లో



## బ్యాంకాక్‌లో ప్రధాని మోడీ

- థాయ్‌లాండ్ వెళ్లిన భారత ప్రధాని
- ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ
- అటు నుంచి అటే శ్రీలంకలో పర్యటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ప్రధాని మోడీ బ్యాంకాక్ చేరుకున్నారు. అక్కడ ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల పర్యటన కోసం గురువారం బయల్దేరి వెళ్లారు. గురువారం నుంచి థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ ఎయిర్‌పోర్టులో దిగగానే మోడీకి ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ అధికారులతో పాటు

-మిగతా 2 లో

## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

- విద్యార్థులకు అండగా ఉంటామన్న రఘునందన్



హైదరాబాద్,
హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని బిజెపి ఎంపి రఘునందన్ రావు అన్నారు. ఓవైపు విద్యార్థులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. విద్యార్థులకు భాజపా అండగా ఉంటుందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు

-మిగతా 2 లో

### బీసీల హక్కులను తొక్కినది

## బీఆర్ఎస్ ప్రభుత్వమే

- 9 ఏళ్ల పాలనలో నిరుద్యోగులను గాలికి వదిలేసారు
- తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్ దే
- అసత్యాలను ప్రచారం చేయడంలో హరీష్ రావు కేసీఆర్ ను దాటిపోయాడు
- హరీష్ రావు విమర్శలకు కౌంటర్ ఇచ్చిన పిసిసి అధికార ప్రతినిధి ఠాకూర్ బాలాజీ సింగ్




హైదరాబాద్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ రాజకీయాల్లో మాటల తూటాలు పేలుతున్నాయి. బోయినిగుట్ట తండాలో జరిగిన బీఆర్ఎస్ సభలో మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేయగా, ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఠాకూర్ బాలాజీ సింగ్ ఘాటుగా స్పందించారు. హరీష్ రావుకు బీసీల హక్కుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని,

-మిగతా 2 లో

## పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

- ముగిసిన ఇరుపక్షాల వాదనలు
- తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం ధర్మాసనం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణలో పార్టీ మారిన పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారంపై విచారణ పూర్తయ్యింది. సుప్రీం తీర్పును రిజర్వ్ చేసింది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై గురువారం ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఇదే అంశంపై బుధవారం కూడా సుదీర్ఘవిచారణ

-మిగతా 2 లో

## దొంగహామీలతో ప్రజలను మోసం చేశారు

- గిరిజనులకు మంత్రి పదవి లేకుండా చేశారు
- మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు



హైదరాబాద్,ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)
దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. తులం బంగారం, 2 లక్షల రుణమాఫీ, యువతులకు స్కూటీలు ఏమయ్యాయని మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి హామీలు సగం.. సగం.. ఆగం ఆగం.. అయ్యాయి.. దేవుళ్ళను మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేయడం పెద్ద విషయం కాదని అన్నారు. ఈ మేరకు మాజీ

-మిగతా 2 లో



## కేసీఆర్‌కు హైకోర్టులో ఊరట

- రైల్‌రోకో కేసు కొట్టివేత

హైదరాబాద్,
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. 2011లో నమోదైన రైల్‌రోకో కేసును ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. తెలంగాణ ఉద్యమ సమయంలో 2011 ఆగస్టు 15న సికింద్రాబాద్‌లో రైల్‌రోకో నిర్వహించారు. ఈ క్రమంలో పలువురిని పోలీసులు

-మిగతా 2 లో




## రాజ్యసభకు చేరిన వక్ఫ్ సవరణ బిల్లు

- సభలో ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- సుదీర్ఘ చర్చ అనంతరం ఓటింగ్
- బిల్లు రాజ్యాంగంపై దాడి అన్న సోనియా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)
సుదీర్ఘ చర్చ తర్వాత లోక్‌సభలో ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గురువారం ఎగువసభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభించారు. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. విపక్షాల ఆరోపణలు, అధికారపక్షం కౌంటర్లతో సభ వాడీవేడిగా సాగింది.

-మిగతా 3 లో

# ఒక్క చెట్టు.. నరికేయొద్దు

(మొదటి తరువాయి)

కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై ఉన్నత న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంపై జస్టిస్ గవాయ్ ధర్మాసనం సీరియస్ అయ్యింది. మూడ్రోజుల వ్యవధిలో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. దీన్ని చాలా సీరియస్ అంశంగా పరిగణించింది. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని జస్టిస్ గవాయ్ ధర్మాసనం ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని మండిపడింది. విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన మధ్యంతర నివేదికను ఉన్నత న్యాయస్థానం పరిశీలించింది. అలాగే మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలను సైతం జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు అమికస్ క్యూరీ పరమేశ్వర్ ఉంచగా.. వాటినీ పరిశీలించింది. కాగా, ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సుప్రీంకోర్టు ప్రతివాదిగా చేర్చింది. ఇంత అత్యవసరంగా భూముల్లో చెట్లు- తొలగించి పనులు చేపట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 15న నియమించిన కమిటీలోని అధికారులు సైతం సమాధానం చెప్పాలని హుకుం జారీ చేసింది. ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటు-ందని తెలిపింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా.. చెట్లు కొట్టేసే ముందు సీఈసీ అనుమతి తీసుకున్నారా? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన నివేదికలోని ఫొటోలు చూసి అక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పింది. వందల కొద్దీ యంత్రాలు మోహరించాల్సిన అగత్యం ఏంటో అర్థం కావడం లేదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం చేపట్టిన పనులపై స్టే విధించింది ఉన్నత న్యాయస్థానం. అయితే సుప్రీంకోర్టు తీర్పుపై హెచ్‌సీయూ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గాలంటూ డిమాండ్ చేస్తున్నారు. గో బ్యాక్ పోలీస్ అంటూ నినాదాలు చేస్తున్నారు. భారీ వర్షంలోనూ నిరసనలు తెలుపుతున్నారు. విద్యార్థుల నినాదాలతో యూనివర్శిటీ ప్రాంగణం దద్దరిల్లుతోంది.

# పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

(మొదటి తరువాయి)

జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. స్పీకర్ తరఫున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. గురువారం స్పీకర్ కార్యదర్శి తరఫున సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ కార్యదర్శి తరఫున అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని సింఘ్వి తెలిపారు. మణిపూర్ వ్యవహారం పూర్తిగా భిన్నమైనదని, ఆ ఒక్క విషయాన్ని ప్రత్యేకంగా పరిగణించారని అన్నారు. అలాగే రాణా కేసు పూర్తిగా ప్రత్యేకమైనదని, ప్రస్తుత ఆ అంశానికి సరిపోదని సింఘ్వి కోర్టుకు తెలిపారు. దీంతో రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుని అనర్హత విధించిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి అని సింఘ్విని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. సుప్రీంకోర్టుకు వచ్చిన తర్వాత న్యాయవాదుల తీరు పూర్తిగా మారిపోతోందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఇటీవల సీఎం అసెంబ్లీలో మాట్లాడిన మాటలను కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది మరోసారి ప్రస్తావించారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావని, స్పీకర్ తరపున కూడా చెపుతున్నా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను న్యాయవాది ప్రస్తావించారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారని న్యాయవాది అన్నారు. దీంతో ముఖ్యమంత్రి కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగిందని, ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా అని జస్టిస్ గవాయ్ అన్నారు. దీంతో అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ ప్రతిపక్షం నుంచి అంతకు మించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతం అని ధర్మాసనం పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు దిక్కారం కింద తీసుకోవాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు. మేము సంయమనం పాటిస్తున్నామని, మిగతా రెండు వ్యవస్థలు అదే గౌరవంతో ఉండాలని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు పిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూసారని సింఘ్వి అన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడివరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి విచారణకు వచ్చిన తర్వాతే నోటీసులు ఇచ్చారని గవాయ్ అన్నారు. ఈ క్రమంలో మణిపూర్ వ్యవహారం, రాణా కేసుతో పాటు మరికొన్ని అంశాలను అభిషేక్ సింఘ్వి కోర్టుకు వివరిస్తూ వాదనలు ముగించారు. అభిషేక్ మను సింఘ్వి వాదనలు ముగియడంతో.. పిటీషనర్ల తరపున కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి చివరి వాదనలు వినిపించారు. మహారాష్ట్ర వ్యవహారం సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ నిర్ణయంపై సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చిందన్నారు. స్పీకర్‌కు తగిన ఆదేశాలు ఇవ్వడానికి సుప్రీంకోర్టుకు అన్ని అధికారాలు ఉన్నాయన్నారు.

# ఆస్తుల వెల్లడికి సుప్రీం జడ్జీల అంగీకారం

## ఫుల్ కోర్ట్ మీటింగ్‌లో ఏకగ్రీవ తీర్మానం
## జడ్జీ ఇంట్లో నోట్ల కట్టల నేపథ్యంలో నిర్ణయం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)

న్యాయ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించే లక్ష్యంతో తమ ఆస్తులను బహిర్గతం చేయడానికి సుప్రీంకోర్టుకు చెందిన 30 మంది సిట్టింగ్ న్యాయమూర్తులు అంగీకరించారు. తమ ఆస్తులను సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించేందుకు ప్రధాన న్యాయమూర్తితోసహా న్యాయమూర్తులందరూ ఆమోదం తెలిపారు. ఈ నెల 1న జరిగిన ఫుల్ కోర్టులో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇది భవిష్యత్తు న్యాయమూర్తులకు కూడా వర్తిస్తుంది. గత సంప్రదాయాలకు పూర్తి భిన్నంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక ప్రతి సంవత్సరం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. గతంలో న్యాయమూర్తులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)కి తమ ఆస్తుల వివరాలు అందచేసేవారు. అది కూడా తప్పనిసరి కాదు. న్యాయమూర్తులు స్వచ్ఛందంగా తమ ఆస్తులను బహిర్గతం చేసేవారు. కాగా, తాజా నిర్ణయానికి సంబంధించిన తీర్మానం ఇంకా కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ కాలేదు. ఇటీవల ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో మంటలు చెలరేగి కాలిపోయిన కరెన్సీ కట్టలు కనిపించటం తీవ్ర కలకలం రేపింది.

# బీసీల హక్కులను తొక్కినది బీఆర్ఎస్ ప్రభుత్వమే!

(మొదటి తరువాయి)

గతంలో బీసీ రిజర్వేషన్లను గణనీయంగా తగ్గించి, బీసీల రాజకీయ భవిష్యత్తును అణచివేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని ఆయన ఆరోపించారు. నాటి 33 శాతం బీసీ రిజర్వేషన్లను 18 శాతానికి కుదించిన టీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు బీసీల ప్రయోజనాల కోసం ఆందోళన వ్యక్తం చేయడం ఓ పెద్ద హాస్యాస్పదమైన రాజకీయ నాటకమని బాలాజీ సింగ్ ఎద్దేవా చేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కూడా లేకుండా చేసిన పార్టీ, ఇప్పుడు వారి సంక్షేమంపై మాట్లాడటం వింతగా లేదా? బీసీ సంక్షేమానికి పెద్దపీట వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వస్తే, దానిని ప్రశ్నించే అర్హత హరీష్ రావుకు ఉందా? అంటూ ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఉద్యోగాల విషయంలో హరీష్ రావు చేసిన ఆరోపణలను బాలాజీ సింగ్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోపే 60,000 ఉద్యోగాలను మంజూరు చేసి, నియామక పత్రాలు అందజేసింది. కానీ, హరీష్ రావు మాత్రం 5000 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదంటూ నిరాధార ఆరోపణలు చేస్తూ, తప్పుడు ప్రచారానికి దిగారని మండిపడ్డారు. "బీఆర్ఎస్ పాలనలో 9 ఏళ్లపాటు నిరుద్యోగులు నిరీక్షించినా ఉద్యోగాలు రాలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపడుతున్నప్పుడు, దానిని అడ్డుకోవడానికి హరీష్ రావు ప్రయత్నించడం రాజకీయ కుట్ర." మహిళా సాధికారతపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం హరీష్ రావుకు తగదని బాలాజీ సింగ్ స్పష్టం చేశారు. "ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్, రాయితీ గ్యాస్ సిలిండర్లు, స్వయం సహాయక బృందాలకు భారీగా ఆర్థిక సాయం వంటి పథకాలు తెచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్. టీఆర్ఎస్ హయాంలో మహిళల కోసం ఒక్క కొత్త పథకమైనా ప్రవేశపెట్టారా?" అంటూ ఆయన ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో మహిళలకు ఏమీ చేయని పార్టీ, ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. తెలంగాణను అప్పుల గండంలోకి నెట్టిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని బాలాజీ సింగ్ ఆరోపించారు. "సర్పంచుల బిల్లులు పెండింగ్‌లో పెట్టిన ప్రభుత్వం బీఆర్ఎస్. కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించని ప్రభుత్వం బీఆర్ఎస్. ప్రాజెక్టుల భూసేకరణ చేసినా రైతులకు పరిహారం ఇవ్వని ప్రభుత్వం బీఆర్ఎస్." తెలంగాణను లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో ముంచిన పార్టీ ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. హరీష్ రావు గతంలో "ఆమనగల్లు ప్రాంతానికి 10 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు అవసరమా?" అని వ్యంగ్యంగా మాట్లాడారని, ఇప్పుడు అదే చోటికొచ్చి విమర్శలు చేయడం పూర్తిగా రాజకీయం అని బాలాజీ ఎత్తిచూపారు. "తమ పాలనలో రాష్ట్రాన్ని కూలదోసి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే, అది సాధ్యం కాదు!" తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీపై నమ్మకం కోల్పోయారని, సభల్లో నాలుగు చప్పట్లు కొట్టించుకోవడం వల్ల ప్రజలు మళ్లీ నమ్ముతారని హరీష్ రావు భావిస్తే, అది అతని భ్రాంతి మాత్రమే అని బాలాజీ ఎద్దేవా చేశారు. "9 ఏళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, బీసీల హక్కులను అణచివేసి, మహిళలను పట్టించుకోకుండా, ఉద్యోగాల కల్పనలో విఫలమైన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. కానీ, ఈసారి ప్రజలు నిజాన్ని అర్థం చేసుకుంటారు!" తెలంగాణ ప్రజలు ఇప్పుడు బీఆర్ఎస్ మాయ మాటలను నమ్మే పరిస్థితిలో లేరు. బీసీలకు అన్యాయం చేసింది టీఆర్ఎస్. ఉద్యోగాల కల్పనలో విఫలమైనది టీఆర్ఎస్. మహిళా సాధికారతను నిర్లక్ష్యం చేసినది టీఆర్ఎస్. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినది టీఆర్ఎస్. "తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ మాయ మాటలను నమ్మే రోజులు పోయాయి. హరీష్ రావు అసత్య ఆరోపణలు చేస్తే, వాటిని తిప్పికొట్టడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉంది అని ఆయన అన్నారు.

## బీసీ గర్జనకు రాహుల్ వస్తాడని చెప్పలేదు

(మొదటి తరువాయి)

జరుగుతున్న చర్చ పై కూడా ఆయన స్పందించారు. భూములు ప్రభుత్వానికి చెందినవేనని, ఇది కోర్టు పరిధిలో ఉన్న అంశమని ఆయన తెలిపారు. విద్యాసంస్థల అవసరాల కోసమే ఈ భూములను వినియోగించుకుంటామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో జరిగిన భూ అక్రమాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అవి నిరూపించగలమని మహేష్ గౌడ్ అన్నారు. ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమణకు గురైన వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు హైడ్రా తీసుకువచ్చామని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్, బీజేపీ అడ్డుపడుతున్నాయని మహేష్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటు-న్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ రెండు పార్టీలే ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ భూముల నుంచే మై హోమ్‌కు వంద అడుగుల రోడ్డు అనుమతి ఎలా ఇచ్చారని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే ఎలా జరిగిందో తమకు అనుమానం ఉందని, దానిపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. మూడేళ్లలో మేము అధికారంలోకి వస్తామని కేటీ-ఆర్ పగటి కలలు కంటు-న్నాడు అంటూ మహేష్ గౌడ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నదని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమకు తిరిగి అవకాశం కల్పిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం జరగాల్సిన మంత్రివర్గ విస్తరణలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

## బ్యాంకాక్‌లో ప్రధాని మోడీ

(మొదటి తరువాయి)

భారతీయులు భారీ స్వాగతం పలికారు. తొలుత రెండు రోజుల పాటు థాయ్‌లాండ్‌లో మోడీ పర్యటించనున్నారు. థాయ్‌లాండ్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో మోడీ పాల్గొనన్నారు. పర్యటనలో భాగంగా థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్‌టార్న్ షినవత్రాతో కూడా భేటీ అయి ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇక సాయంత్రం బిమ్‌స్టెక్ సదస్సులో మోడీ పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్‌తో పాటు- థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొననున్నారు. ఇక ఈ సదస్సులో సాంకేతిక, ఆర్థిక సహకారంపై చర్చించనున్నారు.

## దొంగహామీలతో ప్రజలను మోసం చేశారు

(మొదటి తరువాయి)

మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. సేవాలాల్ జయంతి కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అధికారికంగా ప్రకటించారు.. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత బిఆర్ఎస్ పార్టీది.. బంజారా భవన్ ఏర్పాటు- చేశారు, తండాలను గ్రామపంచాతీలుగా ఏర్పాటు-, మంచినీటి సరఫరా ఏర్పాటు, పాలమూరు బిడ్డ, నల్లమల బిడ్డ అనే రేవంత్ రెడ్డి ఈ ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయిలో రుణమాఫీ ఎందుకు చేయలేదు.. రైతు బంధు వర్ష కాలంలో 8 వేల కోట్లు-, యాసంగిలో 4 వేల కోట్లను ప్రజలకు ఎగ్గొట్టిన ఘనుడు రేవంత్ రెడ్డి.. కరోనా సమయంలో కేసీఆర్ రైతు బంధు ఇచ్చిండు.. రేవంత్ రెడ్డి కుటు-ంబ ఆదాయమే ముఖ్యం.. అయితే లూటీ- లేకుంటే లాఠీ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫోర్త్ సిటీ- పేరున వేల ఎకరాల భూమిని లాక్కుంటు-న్నారు.. 16 నెలల అవుతున్న పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదు.. కేసీఆర్ కిట్టు-, రమజాన్ టోఫా, రైతు బంధు, ఫీజు రీయింబర్స్ మెంట్ లు బంద్ చేశారని మండిపడ్డారు. గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వని రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ప్రభుత్వ భూములు అమ్ముకోవడమే రేవంత్ రెడ్డి పని.. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపిన రేవంత్ రెడ్డి.. 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ మోసం చేశారు.. దమ్ముంటే గన్మెన్లు, పోలీసులు లేకుండా బోయిన్ గుట్ట తండాకురా...రుణమాఫీ అయిందా లేదా చెబుతారు అని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.

## కేసీఆర్‌కు హైకోర్టులో ఊరట

(మొదటి తరువాయి)



(మొదటి తరువాయి)

అరెస్టు చేశారు. నిందితులు చెప్పిన వాంగ్మూలం ఆధారంగా కేసీఆర్‌ను 13వ నిందితుడిగా రైల్వే పోలీసులు చేర్చారు. ఈ మేరకు ప్రజాప్రతినిధుల కోర్టులో పోలీసులు అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో.. కేసును కొట్టివేయాలంటూ కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. రైల్‌రోకో జరిగిన సమయంలో కేసీఆర్ సంఘటన స్థలంలో లేరని ఆయన తరపు న్యాయవాది వాదించారు. కేసీఆర్ పిలుపుతోనే రైల్‌రోకో నిర్వహించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం.. కేసీఆర్‌పై నమోదైన కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు


(మొదటి తరువాయి)



తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై హెచ్‌సీయూ విద్యార్థుల పోరాట ఫలితంగానే కోర్టు తీర్పు వచ్చిందన్నారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం మేం కూడా పోరాడతాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుచుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లు- కొట్టవద్దని వాల్టా చట్టం చెబుతోంది. ఒక్క చెట్టు- కొట్టడానికే అనుమతి అవసరమైతే.. వందల చెట్లు ఎలా కొట్టారు? మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని అనుకున్న ప్రభుత్వానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ వంటిదని రఘునందన్ పేర్కొన్నారు.

# పిల్లలకు పాఠశాల కంటే వీడియో గేమ్స్ అంటే ఎందుకు ఇష్టం?





**నా** బాబు స్మార్ట్‌ఫోన్ ఇవ్వకపోతే అరుపులు, కేకలు. ఇల్లంతా రచ్చ రచ్చ చేసేస్తాడు. కానీ పుస్తకాలు తెరిచినప్పుడు మాత్రం బద్ధకం పట్టేస్తుంది. చదువు అంటే తప్పించుకునే ప్రయత్నమే. కానీ అదే వీడియో గేమ్ ఆడేటప్పుడు గంటల తరబడి ఏమీ తినకుండా, తలూపకుండా కూర్చుంటాడు!"

ఇలాంటి మాటలు చాలా తల్లిదండ్రుల నోటి నుంచి వినిపిస్తాయి. వీడియో గేమ్స్ పిల్లలను ఎంతగానో ఆకర్షిస్తాయి, కానీ పాఠశాల వారికి ఎందుకు అంతగా నచ్చదు?

గేమింగ్ మోజు వెనుక ఉన్న మర్మం

**పిల్లలు గేమింగ్‌కు ఎందుకు ఆకర్షితులవుతారు?**

**దానికి సమాధానం** – "సైకాలజీతో ముడిపడిన అద్భుతమైన డిజైన్".

**వీడియో గేమ్ ఆడే పిల్లాడిని ఒక్కసారి గమనించండి.**

**స్పష్టమైన లక్ష్యం:**

"ఈ లెవెల్‌ను పూర్తి చేయాలి."

"ఈ శత్రువును ఓడించాలి."

"ఈ స్కోరు సాధించాలి."

అలసిపోకుండా ప్రయత్నించడానికి రెడీ!

ఒకసారి ఓడిపోతాడు ? మళ్లీ ప్రయత్నిస్తాడు ? మళ్లీ ఓడతాడు ? చివరికి గెలుస్తాడు.

విజయం వెంటనే గుర్తింపు తెస్తుంది

Congratulations!

Youre a Winner!

New Power Unlocked !

ఇలాంటి మెసేజ్‌లు అతని మెదడులో డోపమిన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తాయి. అదే హ్యాపీ హార్మోన్. ఇది మళ్లీ మళ్లీ ఆడించాలని పురిగొల్పుతుంది.

**చదువును అలా చూసినప్పుడేమవుతుంది?**

ఒక 7వ తరగతి విద్యార్థి మొఘల్ సామ్రాజ్యం గురించి చదవాల్సి ఉంది.

- అతనికి చదవాల్సిన పాఠం ఎంత పెద్దదో తెలియదు.
- ఎక్కడ మొదలుపెట్టాలో స్పష్టత ఉండదు.
- ఎటువంటి ఫీడ్‌బ్యాక్ ఉండదు
  – పరీక్షల్లో సరైన సమాధానం రాసినా ఫలితం తేలాలంటే చాలా రోజులు పడుతుంది.
- తల్లిదండ్రులు, టీచర్లు ఒత్తిడి పెడతారు ?

మెదడులో ఒత్తిడి హార్మోన్ (కోర్టిసాల్) విడుదల అవుతుంది.

వీడియో గేమ్ మోటివేట్ చేస్తుంది.

చదువు ఒత్తిడిని పెంచుతుంది.

**పిల్లల అనుభవాల నుంచి పాఠం నేర్చుకోవాలి**

8వ తరగతి విద్యార్థిని మిహిర తన అనుభవాన్ని ఇలా వివరించింది

Minecraft ఆడేటప్పుడు నేను ఎంత క్రియేటివ్‌గా ఆలోచిస్తానో నాకు కూడా ఆశ్చర్యమే. కానీ అదే స్కూల్‌లో డ్రాయింగ్ పోటీ ఉంటే భయమేస్తుంది. ఎందుకంటే గెలవకపోతే నన్ను తక్కువగా చూస్తారని భయపడతాను."

ఇక మరో తండ్రి తన కొడుకు గురించి ఇలా అంటున్నారు

"మా వాడు పబ్జిలో టీమ్‌వర్క్, లీడర్‌షిప్, ప్లానింగ్ అన్నీ అద్భుతంగా చూపిస్తాడు. కానీ క్లాస్‌లో ప్రాజెక్ట్ ఇచ్చినప్పుడు మాత్రం నిశ్శబ్దంగా ఉంటాడు. ఎందుకంటే అక్కడ మార్కుల కోసం మాత్రమే పని చేయాలి. ఆలోచనలకు తావుండదు."

**ఇప్పుడు మనం ఏమి చేయాలి?**

- వీడియో గేమ్స్ నిషేధించడం సరైన పరిష్కారం కాదు.
- స్మార్ట్‌ఫోన్ తీసేయడం సమస్యను తొలగించదు.
- 'నీకు కాన్సన్ట్రేషన్ లేదు" అని పిల్లలను తిట్టినా ఉపయోగం ఉండదు.

అదేమిటంటే, విద్యను కూడా వీడియో గేమ్‌లా ఆసక్తికరంగా మార్చాలి.

- చిన్న చిన్న లక్ష్యాలు ఇవ్వాలి
  – చిన్న విజయం పొందిన ఆనందాన్ని అనుభవించాలి.
- ప్రయత్నాన్ని గుర్తించాలి


"శబాష్, నువ్వు మంచి ప్రయత్నం చేశావు" అనే మాట ఎంతో విలువైనది.

- విఫలమైనా మళ్లీ ప్రయత్నించేందుకు అవకాశం ఇవ్వాలి – శిక్షలు కాదు, శక్తినివ్వాలి.
- తక్షణ ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలి – పరీక్షల ఫలితాలకు కాకుండా, ప్రతి రోజు అభివృద్ధిని గుర్తించాలి.
- స్వాతంత్ర్యం ఇవ్వాలి – పిల్లలు తమ నేర్చుకునే విధానాన్ని స్వయంగా ఎంచుకునే అవకాశం కల్పించాలి.
- చదువును ఒక రసవత్తరమైన ప్రయాణంగా చేయాలి – గేమింగ్‌లో మాదిరిగా, విద్యను కూడా ఒక అద్భుతమైన అడ్వెంచర్‌గా మార్చాలి.

**మొత్తానికి సమస్య స్క్రీన్ కాదు.**

సమాధానం చదువులో ఆనందాన్ని జోడించడం. పిల్లలు చదువును ఆటలా ఆస్వాదిస్తే స్క్రీన్ బానిసలు కాదు, విజేతలు అవుతారు!

**వ్యాసకర్త**
**చెరుకు జంగయ్య గౌడ్**



# 3,000 దాటిన మయన్మార్ భూకంపం మృతుల సంఖ్య..

– ప్రకటించిన సైన్యం



**మయన్మార్ ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** భూ విలయంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ విపత్తులో మరణించిన వారి సంఖ్య 3 వేలు దాటింది. వేల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో మయన్మార్‌లో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. నిమిషాల వ్యవధిలోనే 7.7, 6.3 తీవ్రతతో భూమి కంపించింది. ఈ ప్రకంపనలకు రోడ్లు, వంతెనలు, ఇళ్లు దెబ్బతిన్నాయి. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. శిథిలాలను తొలగించే కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. ఇప్పటి వరకూ 3,085 మంది మరణించినట్లు మయన్మార్ సైన్యం గురువారం ప్రకటించింది. దాదాపు 4,715 మంది గాయపడినట్లు పేర్కొంది. మరో 341 మంది గల్లంతైనట్లు వెల్లడించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం దేశంలో సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించింది. 17 దేశాల నుంచి వచ్చిన సహాయ సిబ్బంది శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. ఈ విపత్తులో అండగా నిలబడి అవసరమైన సాయాన్ని అందిస్తున్న దేశాలకు ఈ సందర్భంగా సైన్యం కృతజ్ఞతలు తెలిపింది. మరోవైపు ప్రస్తుత విపత్తు కారణంగా మృతుల సంఖ్య 10 వేలు దాటే అవకాశముందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేసిన విషయం తెలిసిందే.

# రాజ్యసభకు చేరిన వక్ఫ్ సవరణ బిల్లు

(మొదటి తరువాయి)

అనంతరం ఓటింగ్ పక్రియ నిర్వహించగా. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి. రాజ్యసభలోనూ దీనిపై చర్చ కోసం 8 గంటలు కేటాయించారు. అవసరమైతే సమయాన్ని పెంచనున్నారు. అనంతరం ఓటింగ్ చేపడతారు. ఎగువ సభలోనూ అధికార ఎన్డీయేకు స్వల్ప ఆధిక్యం ఉండటంతో బిల్లు గట్టెక్కడం లాంఛనమే అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఉభయ సభల్లో ఆమోదం పొందిన అనంతరం రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా మారనుంది. లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడంపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంపై నిస్సిగ్గుగా దాడి జరిగిందని అభిప్రాయపడ్డారు. గురువారం రాజ్యసభలోకి వెళ్లే ముందు సోనియాగాంధీ మీడియాతో మాట్లాడారు. సమాజంలో శాశ్వత విభజనను తీసుకొచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని.. అందులో భాగంగానే వక్ఫ్ బిల్లును ఆమోదించినట్లు–గా వ్యాఖ్యానించారు. దిగువ సభలో బిల్లును బుల్డోజర్ చేశారని చెప్పారు. అలాగే వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును కూడా రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేందుకే సభలోకి తీసుకొస్తున్నారని సోనియాగాంధీ ధ్వజమెత్తారు. మోడీ నిర్ణయాలు కారణంగా దేశం అగాధంలోకి నెట్టబడుతోందని.. ఈ నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగం కాగితంపైనే ఉంటుంది.. అందుకే దాన్ని బుల్డోజర్ చేయడమే బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. న్యాయం కోసం ఎంపీలంతా కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇక పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదని.. తరచుగా గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించింది. బుధవారం బిల్లుపై పార్లమెంట్‌లో వాడీవేడీగా చర్చ జరిగింది. దాదాపు 12 గంటల పాటు– అధికార–ప్రతిపక్ష సభ్యులు ప్రసంగించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత బిల్లు ఆమోదం కోసం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా ఓటింగ్ పడడంతో ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 282 మంది ఓటు– వేయగా.. 232 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. ఇక గురువారం ఈ బిల్లు రాజ్యసభకు రానుంది. ఇక్కడ కూడా దాదాపు 8 గంటల పాటు–చర్చ జరగనుంది. వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసేలా ఈ కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈమేరకు 1995 నాటి వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లుప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఈ బిల్లును గతేడాది ఆగస్టులోనే కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అప్పుడు దీనిపై విపక్షాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ– (జేపీసీ) పరిశీలనకు పంపింది. ఈ కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది.

## జూబ్లీహిల్స్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడు అరెస్టు



**బంజారాహిల్స్, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బిర్యానీ సెంటర్ వద్ద నిలబడి డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడిని అబ్కారీకి చెందిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్‌రోడ్డు నెంబరు 11 తాడిపత్రి బిర్యానీ సెంటర్ వద్ద డ్రగ్స్ అమ్మకాలు సాగుతున్నట్టు అబ్కారీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో మఫ్టీలో నిఘా పెట్టగా ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని తనిఖీ చేయగా 7 గ్రాముల కోకైన్, 3.7 గ్రాముల ఎక్స్టసీ పిల్స్ లభించాయి. ప్రశ్నించగా ఓ పెడలర్ వద్ద నుంచి కొనుగోలు చేసి వాటిని ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు తేలింది. నిందితుడు వెస్ట్‌గోదావరి జిల్లా భీమవరానికి చెందిన కోపర్తి సాయిమణికంఠ అని తేలింది. పోలీసులు అతని వద్ద నుంచి మత్తు పదార్థాలు, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాదీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# హెచ్.సి.యు భూముల పరిరక్షణకు కృషి

– రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర విలువైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయు) భూములు అన్యాక్రాంతం కాకుండా, వాటి పరిరక్షణకు తన వంతు కృషి సల్పుతున్నారు. గచ్చిబౌలి వద్ద నెలకొన్న ఈ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఉన్న భూముల్లో 400 ఎకరాలను వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాల్సిందిగా కేంద్రాన్ని కోరారు. అత్యంత విలువైన ఈ భూములను పరిరక్షించాల్సిన అవసరం గురించి మొన్న రాజ్యసభలో మాట్లాడిన ఎంపీ రవిచంద్ర, నిన్న సహచర ఎంపీలు, బీఆర్ఎస్ నాయకులతో పాటు సంబంధిత శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను కలిసి వినతిపత్రం అందజేయడం తెలిసిందే. అలాగే, ఎంపీ రవిచంద్ర రాజ్యసభలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో యూనివర్సిటీ భూముల అంశాన్ని తిరిగి లేవనెత్తారు. ఈ సందర్భంలో కాంగ్రెస్ సభ్యులు అడ్డుకోవాలని చూసినా కూడా ఆయన ఏ మాత్రం వెనుకడు వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న తప్పుడు వైఖరిని ఎండగట్టారు. విద్యా,పరిశోధనా, నైపుణ్యాభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తు అవసరాల కోసం యూనివర్సిటీకి చెందిన విలువైన ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై, మనందరిపై ఉందని ఎంపీ వద్దిరాజు అన్నారు. హెచ్ సీయు క్యాంపస్ లోని ఈ భూముల్లో నీటి వనరులతో పాటు అరుదైన వృక్ష సంపద,పక్షి జాతులు,భారీ రాళ్ల వరుసలు, జింకలు, మన జాతీయ పక్షి అయిన నెమళ్లు, తాబేళ్లు, సరీసృపాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని,వాటి మనుగడకు ప్రమాదం వాటిల్లుతున్నదని ఎంపీ రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. చక్కని జీవవైవిధ్యంతో కూడిన ఇక్కడ నుంచే




కాంక్రీట్ జంగల్ గా మారిన పరిసర ప్రాంతాలకు సహజ వాయువు లభిస్తున్నదని తెలిపారు. ఇటువంటి భూముల్ని వేలం వేసేందుకు గాను అందులో ఉన్న భారీ వృక్షాలను రాత్రిపగలు అనే తేడా లేకుండా జేసీబీలు, ప్రొక్లైనర్లతో యధేచ్ఛగా నర్కేస్తున్నారని, వద్దని అడ్డుపడుతున్న విద్యార్థులు,అధ్యాపకులపై పోలీసులు లాఠీఛార్జ్ చేస్తూ భయాందోళన సృష్టిస్తున్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను కూడా సభకు సమర్పిస్తానని ఆయన తెలిపారు. కూడా చెట్లను నర్కేస్తు పచ్చదనాన్ని, పర్యావరణాన్ని విధ్వంసం చేసే హక్కు ఎవరికి కూడా లేదని, ఈ భూములను వేలం వేయకుండా, అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కేంద్ర ప్రభుత్వానికి మరోసారి విజ్ఞప్తి చేశారు.

# సుప్రీం తీర్పుతో సెంట్రల్ వర్సిటీ విద్యార్థుల హర్షం



**హైదరాబాద్, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలు అన్నీ నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూలో విద్యార్థులు సంబురాలు నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యలు విరమించుకోవాలని విద్యార్థులు సూచించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు పోరాటం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

# అగ్రికల్చరల్ డిగ్రీ కళాశాల తరలింపు పై నోముల భగత్ ఆగ్రహం

**త్రిపురారం, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం మండలంలో ఉన్న బీఎస్సీ అగ్రికల్చరల్ డిగ్రీ కళాశాల హుజూర్నగర్‌కు తరలింపుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఈ తరలింపును తీవ్రంగా ఖండిస్తూ, కళాశాలను త్రిపురారం మండలంలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో నిడమానూరులో ఉన్న విత్తన అభివృద్ధి సంస్థను తరలించిన తర్వాత, ఇప్పుడు అగ్రికల్చరల్ డిగ్రీ కళాశాల తరలింపు దురదృష్టకరమని ఆయన అభిప్రాయపడ్డారు. త్రిపురారం మండలం కంపసాగర్‌లో వ్యవసాయ పరిశోధన కేంద్రం వద్ద గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనుమతులు తెచ్చినప్పటికీ, ప్రస్తుతం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తమ పలుకుబడి ఉపయోగించి



కళాశాలను హుజూర్నగర్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఉన్న విద్యార్థులు కళాశాల లేక పక్క రాష్ట్రాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని నోముల భగత్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి ఇప్పటి వరకు కంపసాగర్‌లో ఉన్న కళాశాలను సందర్శించకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా కళాశాలను తిరిగి త్రిపురారం మండలంలోనే నిర్మించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పామోజీ వెంకటాచారి, రైతుబంధు జిల్లా డైరెక్టర్ అనుముల శ్రీనివాస్, రైతుబంధు మండల అధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కామర్ల జానయ్య, పిఏసిఎస్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, బిఆర్ఎస్ నాయకులు బైరం కృష్ణ, నగిరి శ్రీను, మాజీ మార్కెట్ డైరెక్టర్ రవి, కొండల్, సాయిలు, చింతకాయల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు పంచాంగం 4/4/2025,శుక్రవారం



సూర్యోదయం& సూర్యాస్తమయం:
సూర్యోదయం: ఉదయం 6:12
సూర్యాస్తమయం: సాయంత్రం 6:26
తిథి:
శుక్ల పక్ష సప్తమి: ఏప్రిల్ 3 రాత్రి 9:41 నుండి ఏప్రిల్ 4 సాయంత్రం 8:12 వరకు
శుక్ల పక్ష అష్టమి: ఏప్రిల్ 4 సాయంత్రం 8:13 నుండి ఏప్రిల్ 5 సాయంత్రం 7:26 వరకు
నక్షత్రం:
ఆరుద్ర: ఏప్రిల్ 4 ఉదయం 5:51 నుండి ఏప్రిల్ 5 ఉదయం 5:20 వరకు
పునర్వసు: ఏప్రిల్ 5 ఉదయం 5:20 నుండి ఏప్రిల్ 6 ఉదయం 5:32 వరకు
అశుభ సమయాలు (దోష కాలాలు):
రాహుకాలం: ఉదయం 10:47 నుండి మధ్యాహ్నం 12:19 వరకు
యమగండం: మధ్యాహ్నం 3:22 నుండి సాయంత్రం 4:54 వరకు
దుర్ముహూర్తం: ఉదయం 8:38 నుండి 9:27 వరకు, మధ్యాహ్నం 12:43 నుండి 1:32 వరకు
వర్జ్యం: మధ్యాహ్నం 2:04 నుండి 3:38 వరకు
శుభ సమయాలు (శుభ ముహూర్తాలు):
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:54 నుండి 12:43 వరకు
అమృతకాలం: సాయంత్రం 7:32 నుండి రాత్రి 9:06 వరకు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:35 నుండి 5:23 వరకు

## రైలు ఢీకొని 18 మేకలు మృతి

**–ఈ సంఘటన బైపాస్ సోలిపూర్ రైల్వే బిడ్జ్ సమీపంలోని చోటు చేసుకున్న ఘటన..**



**షాద్ నగర్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రైలు ఢీకొని 18 మేకలు మృత్యువాతపడ్డాయి.ఈ సంఘటన సోలిపూర్ రైల్వే బైపాస్ బ్రిడ్జ్ సమీపంలోని బుధవారం సాయంత్రం జరిగింది. షాద్ నగర్ పురపాలిక పరిధిలో సోలిపూర్ గ్రామానికి చెందిన గడ్డం కృష్ణయ్య యాదవ్ కు చెందిన మేకలను బుధవారం మేత మేపటానికి తీసుకెళ్లారు.. సాయంత్రం తిరిగి వస్తుండగా మార్గంలో రైలు వేగంగా వెళ్తుండటంతో.. ఆ శబ్ధానికి భయపడిన మేకలు రైలు పట్టాలపైకి పరుగులు తీశాయి..ఆ రైలు ఢీకొనడంతో 18 మేకలు మృతి చెందాయి.. రైలుపట్టాలపై చెల్లాచెదురుగా పడిపోయాయి.ఈ మేకల విలువ సుమారు రూ. 3లక్షలు ఉంటుందని గడ్డం కృష్ణయ్య యాదవ్ తెలిపారు..మేకలు చనిపోవడంతో తాను జీవనోపాధి కోల్పోయానని శోకసంద్రంలో మునిగిపోయారు.

## రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్ భూపాల్ ను సత్కరించిన జిల్లా కోర్ కమిటీ



**హైదరాబాద్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన రాజ్ భూపాల్‌ను జిల్లా కోర్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో బొక్క నర్సింహా రెడ్డి, అంజన్ కుమార్, డాక్టర్ ప్రేమ్ రాజు, మాజీ ఎమ్మెల్యే రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బీజేపీని జిల్లాలో మరింత బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని సాధించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ నెల 6 నుండి ప్రారంభమయ్యే సంస్థాగత కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడం, అలాగే మోడీ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లడం వంటి అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకి వచ్చాయి. ఈ కార్యక్రమంలో పాపయ్య గౌడ్, ప్రకాష్, జంగయ్య, ప్రతాప్, అందెల శ్రీరాములు, కొత్త అశోక్ గౌడ్, లచ్చి రెడ్డి, సునీత రెడ్డి, శ్రీధర్, ధీరజ్ రెడ్డి, శంకర్ రెడ్డి, దయానంద్ గౌడ్, అర్జున్ రెడ్డి, అంజయ్య యాదవ్, భీమార్జున్ రెడ్డి, రామచంద్ర రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి శోభాయాత్రలో కుటుంబ సమేతంగా పాల్గొనండి...



**అంబర్పేట్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భాగ్ అంబర్పేట్ లో మార్వాడి యువ మంచ్ మరియు సిర్వి సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న శ్రీరామనవమి ఉత్సవ సమితి అంబర్పేట అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ డాక్టర్ ఎన్ గౌతమ్ రావు 6 ఏప్రిల్ 2025 ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు జరగబోయే శ్రీరామనవమి శోభాయాత్రలో కుటుంబ సమేతంగా పాల్గొనాల్సిందిగా వారు సమాజ్ ప్రతినిధులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారితో పాటు సమాజ్ ప్రతినిధులు కేశరాం చౌదరి, రమేష్ చౌదరి, మహావీర్ జైన్, కుమార్ జైన్,ద్వారకా దాస్, పోకరామ్ చౌదరి, ప్రకాష్ చౌదరి,ఉత్సవ సమితి సంయుక్త కన్వీనర్లు ఏడెల్లి అజయ్ కుమార్, సి.కృష్ణ గౌడ్, దేవరుప్పల రమేష్, కెంచే చంద్రశేఖర్, పి.నాగరాజు చారి, బాలు, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటయోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య

**–కురుమ సంఘం అధ్యక్షులు నిట్ట కొండల్, బర్ల వేంకటయ్య**



**ఆమనగల్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండల కేంద్రంలో కురుమ సంఘం అధ్యక్షులు నిట్ట కొండల్, బర్ల వేంకటయ్య, సంఘం నాయకులతో కలిసి దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దొరలు, భూస్వాములు రైతులపై చేస్తున్న దౌర్జన్యానికి ఎదురునిలిచి, భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన మహనీయుడు అని కొనియాడారు. కొమురయ్య జయంతిని గత ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. నేటి యువత కొమురయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని అన్యాయంపై పోరాడాలని పిలుపునిచ్చారు. దొడ్డి కొమురయ్య తెలంగాణలో దొరలు, భూస్వాముల దౌర్జన్యానికి ఎదురునిలిచి ప్రాణాలను ఆర్పించారన్నారు. తెలంగాణ సమాజంలో అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం మహనీయుల స్ఫూర్తితోనే వచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో నిట్ట కొండల్, బర్ల వేంకటయ్య, సంఘం నాయకులు చీమర్ల రమేష్, దొడ్డమోని కృష్ణ, బన్నె నరసింహ, బన్నె ఆంజనేయులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవాలయ అభివృద్ధి కోసం యాదాద్రి ఇన్‌ఫ్రా చేయూత



**తుర్కయంజల్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాద్‌లోని తుర్కయంజల్ లో గట్టునెమలిపురం రామాలయ నిర్మాణ అభివృద్ధికి కొత్త ఉత్సాహం లభించింది. గ్రామ అభివృద్ధి ప్రయత్నాల్లో భాగంగా యాదాద్రి ఇన్‌ఫ్రా ఎం.డి. ముచర్ల శ్రీకాంత్ యాదవ్ సత్వరమే స్పందించి గ్రామ దేవాలయ నిర్మాణానికి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ దానం గ్రామ ప్రజల సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక అభివృద్ధి పట్ల వారి నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. ఈ కార్యక్రమంలో వెలుగు సైదులు, దేవాలయ చైర్మన్ రుద్రక్షల కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుర్రి రామలింగం, మరియు గ్రామ ప్రముఖులు బుర్రి యాదగిరి, వెలుగు యాదయ్య, మాజీ వార్డు సభ్యులు మల్లికంటి సైదులు, కొన్ రెడ్డి ముత్యాలు, మరియు ఇతర గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# పక్కా గృహాన్ని ప్రారంభించిన మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డిలు

**కద్తాల్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కద్తాల మండల కేంద్రానికి చెందిన షేడ యాదమ్మ కు జరుపుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన పక్క గృహాన్ని మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు సబితా ఇంద్రారెడ్డిలు ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలుస్తుంది.. ఏ ఆసరా లేనివారికి తానున్నానని భరోసా కల్పిస్తుంది. దీనిలో భాగంగా మండలంలోని ముద్విన్ గ్రామానికి చెందిన నిరుపేద మహిళ షేడ యాదమ్మ పూరిగుడిసెలో నివసిస్తున్న విషయం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జరుపుల దశరథ్ నాయక్ సహకారంతో రూ. 10, లక్షలతో నిర్మించిన నూతన పక్క గృహాన్ని గురువారం మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి



నూతన గృహప్రవేశం నిర్వహిస్తున్న మాజీ మంత్రి హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, జైపాల్ యాదవ్, దశరథ్ నాయక్

శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు సేవలు అందిస్తున్న జరుపుల రాధాకృష్ణ ట్రస్ట్ చైర్మన్ ను పలువురు అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమంలో ముందుండాలని ప్రతి ఒక్కరు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు రాంపాల్ నాయక్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా, డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మున్సిపల్ చైర్మన్ యద్మ సత్యం, మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కంబల పరమేష్, పోనుగోటి అర్జున్ రావు, నాయకులు విజితా రెడ్డి, లాల్కోట నరసింహ, సి ఎల్ శ్రీనివాస్ యాదవ్, పత్య నాయక్, నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, వినోద్, జోగు వీరయ్య, కరాటే రాజు, లచ్చి రామ్ నాయక్, అర్జున్ రావు, లాలయ్య గౌడ్, లచ్చి రామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జ్ఞాన దీక్షలో పాల్గొన్న ఎర్రోళ్ల రాఘవేందర్

**కద్తాల్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పదవులు కంటే ప్రజా శ్రేయస్సే అత్యవసరమని నమ్ముతూ, ప్రజలతోపాటు ప్రజల కోసమే పనిచేసేందుకు అంకితమవుతూ, ఎర్రోళ్ల రాఘవేందర్ తన ధృడ సంకల్పాన్ని మరోసారి చాటుకున్నారు. కద్తాల్ పట్టణ కేంద్రంలో మహనీయుల జ్ఞాన దీక్ష కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. దీక్ష అనంతరం దొడ్డి కొమురయ్య జయంతి మరియు ఛత్రపతి శివాజీ వర్ధంతి సందర్భాలను పురస్కరించుకుని, వారికి ఘన నివాళి అర్పించారు.





తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ మాట్లాడుతూ, మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడం తమ ముఖ్యమైన లక్ష్యమని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అలాగే రాజ్యాంగ పఠన చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సిలివేరు, కావలి కుమార్, కృమ మహేష్, బాలరాజు, కంబాల నరసింహ, సిద్దిగరిగారి మహేష్, దుద్దు నాగరాజు, కనుగుల గణేష్, కాలే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు వన మైసమ్మ అనుగ్రహం పొందాలి

**– రమావత్ రవీంద్ర కుమార్**



**చింతపల్లి, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్లగొండ జిల్లాలోని చింతపల్లి మండలం, పొలేపల్లి రాంనగర్ వన మైసమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలతో ఈ కార్యక్రమం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ, "దైవ చింతన మానసిక ప్రశాంతతను కలిగించడమే కాకుండా, జీవన గమనానికి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది," అని పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హిందూ ధర్మ పరిరక్షణ మరియు ఆలయాల పునర్నిర్మాణానికి చారిత్రాత్మక చర్యలు తీసుకుందని, రాష్ట్రంలోని ఆలయాలు ఆధ్యాత్మికతకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతిబింబంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, కేతావత్ బిల్య నాయక్, ఆలయ కమిటి చైర్మన్ సిద్ధగోని కృష్ణ గౌడ్, మునుకుంట్ల శేఖర్ గౌడ్, ఐతగొని శేఖర్, ఉడుత అక్రం యాదవ్, ఈరటి శేఖర్, ముద్దం జోగయ్య, కేతావత్ జగన్ నాయక్, బాదేపల్లి నీరంజన్, చందర్ నాయక్, జైపాల్, సిమర్ల శ్రీను యాదవ్, మదార్, జంగయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు



న్యూఢిల్లీలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన ఆమనగల్లు నాయకులు గుఱ్ఱం కేశవులు, మండ్లి రాములు తదితరులు

## కలెక్టరేట్ లేపేస్తామని ( బ్లాక్) మెయిల్

**అప్రమత్తమైన అధికారులు**



**నాగర్ కర్నూల్ కలెక్టరేట్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ను గురువారం మధ్యాహ్నం మూడు గంటల లోపు ఐఈడి బాంబులతో లేపేస్తామని గుర్తు తెలియని వ్యక్తులు కలెక్టర్ కు ఉదయం మెయిల్ చేశారు.ఈ మెయిల్ ను కొంత ఆలస్యంగా చూసిన అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు .బాంబు స్క్వాడ్ బృందాలతో డీఎస్పీ శ్రీనివాస్,సీఐ కనకయ్య గౌడ్ హుటాహుటిన కలెక్టరేట్ కు చేరుకొని తనిఖీలు నిర్వహించారు. మెయిల్ చేసిన వ్యక్తి పేరు ముప్పాల లక్ష్మణరావు అని ఉంది.దాని క్రింద అల్లాహు అక్బర్ ఉందని డీఎస్పీ మీడియాకు వివరించారు.ఇది ఫేక్ మెసేజ్ గా గుర్తించడం జరిగిందని అన్నారు కార్యాలయంలో తనిఖీలు చేశామని మీడియాకు తెలిపారు.మెయిల్ చేసిన వ్యక్తిని గుర్తించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. కాగా కలెక్టరేట్ ను బాంబులతో లేపేస్తామని మెసేజ్ వచ్చిన నేపథ్యంలో ఉద్యోగులు ఉలిక్కి పడి,బయటికి వెళ్లిపోయారు.బాంబ్ స్క్వాడ్ బృందాల తనిఖీతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# సిద్దిపేట జిల్లా భారతీయ జనతా పార్టీ పదాధికారుల సమావేశం...

**-పాల్గొన్న దివాస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు జూటూరు కీర్తి రెడ్డి ...**





**సిద్దిపేట, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దివాస్ రాష్ట్ర కమిటీ మెంబర్ జూటూరు కీర్తి రెడ్డి సిద్దిపేట జిల్లా భారతీయ జనతా పార్టీ పదాదికారుల ముఖ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు, స్థాపన దివాస్ రాష్ట్ర కమిటీ మెంబర్ జూటూరు కీర్తి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో సిద్ధిపేట బీజేపీ జిల్లా అధ్యక్షులు శంకర్ ముదిరాజ్, సిద్ధిపేట కాంటెస్టెడ్ ఎమ్మెల్యే దూది శ్రీకాంత్ రెడ్డి, హుస్నాబాద్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే సిరేందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఉమా రెడ్డి, జిల్లా నాయకులు వంగ రాంచంద్రంలో రెడ్డి, రామ్ రెడ్డి, వెంకట రమణ, జనార్ధన్, శివ కుమార్, శివ కుమార్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే



**డిండి, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం డిండి మండలం గుండ్లపల్లి కేంద్రంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం పేద ప్రజలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఏఎస్పీ మౌనిక, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ లు ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఉద్దేశ్యం సామాన్య ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి, వారికి మెరుగైన జీవన స్థాయిని అందించడమే అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రభుత్వం ఎంతో ఆర్థిక సౌలభ్యంతో రూపొందించి, ప్రతి అర్హత కుటుంబానికి నాణ్యమైన బియ్యాన్ని ఉచితంగా పొందే అవకాశాన్ని కల్పించింది. ఈ పథకంతో రాష్ట్రం ప్రగతిశీల భావనకు నిలువుటద్దంగా మారినందుకు రాష్ట్ర ప్రభుత్వం గర్వించవచ్చు. కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు తెలపగా, బియ్యం సరఫరా విధానం మరియు నాణ్యతపై వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.
మమ్మల్ని సంప్రదించడానికి:
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909
మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

# దక్షిణ తెలంగాణ అభివృద్ధి చూసి ఓర్వలేక పోతున్న బీఆర్ఎస్ నాయకులు

**– హరీష్ రావు అబ్బద్దాల అసత్య ప్రచారాలను ప్రజలు విశ్వసించరు**
**– పీసీసీ కార్యవర్గ సభ్యులు – శ్రీనివాస్ గౌడ్**



**కడ్తాల్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులు ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హన్మ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ తో కలిసి పీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దక్షిణ తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్న బీఆర్ఎస్ నాయకులు బావా బామ్మార్దులు హరీష్ రావు మరియు కేటీఆర్. ఈరోజు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు 22 వేల కోట్ల రూపాయలతో దాదాపు 26 లక్షల మంది రైతులకు అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపు రుణమాఫీ చేసి అదేవిధంగా సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇచ్చి రైతులకు పెద్దన్నగా నిలిచారన్నారు. ఈరోజు దేశంలో ఎక్కడ లేని విధంగా భారత్ జోడో యాత్రలో శ్రీ రాహుల్ గాంధీ గారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేవంత్ రెడ్డి దేశంలో ఎక్కడ చేయని విధంగా రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన చేసి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటి బీసీల సంఖ్య తేల్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ విద్యా ఉద్యోగ స్థానిక ఎన్నికల్లో ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. అదేవిధంగా లంబాడాలకు ఏమి చేయలేదని మాట్లాడిన హరీష్ రావు మీరు మర్చిపోయారా.. కాంగ్రెస్ పార్టీ గతంలో లంబాడాలు బీసీ ఈ గ్రూపులో ఉంటే ఇందిరాగాంధీ ఎస్టీల్లో చేర్చి రిజర్వేషన్లతో పాటు అన్ని సదుపాయాలు కల్పించి ఆదుకున్నారన్నారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించి అసెంబ్లీ సమావేశాల్లో గోర్ బోలి భాషను భారత రాజ్యాంగంలో 8వ షెడ్యూల్లో చేర్చి 23వ భాషగా గుర్తించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగింది అన్నారు. అదేవిధంగా ఉద్యోగాలు ఇస్తామన్న మాట మీద సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన గొప్పతనం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెల్లుతుందని అన్నారు. హాస్టల్ విద్యార్థులకు ఎక్కడి లేని విధంగా మెస్ ఛార్జీలు మరియు కాస్మోటిక్ ఛార్జీలు పెంచారన్నారు. మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్ సిలిండర్, 10లక్షలు ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫి, వ్యవసాయ ఉపాధి కూలీలకు రైతూ భరోసా వంటి హామీలను నెరవేర్చామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు రాజీవ్ యువ వికాస్ పథకం కింద రాయితీలతో అండగా నిలుస్తుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కోన్ని వందల కోట్లు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే ఇక్కడి నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులకు మింగుడుపడక ప్రజలలో అంధకారం ఆఐపోతామని అసత్య ప్రచారాలతో ప్రగతిని అడ్డుకుంటురాన్నారు. రేవంత్ రెడ్డి మాటల మనిషని, చేతల మనిషి రోజుకు 18 గంటలు పనిచేస్తూ ఈ రాష్ట్రంలో అన్ని రంగాల్లో ముందు తీసుకుపోవాలని కృతనిత్యంతో ఉన్న నాయకుడుని అన్నారు. రేవంత్ రెడ్డి పుట్టిన గడ్డపైన హరీష్ రావు నిందలు వేస్తూ వేల కోట్లు తీసుకెళ్లి కల్వకుర్తికి ఆమనగల్లు అత్తగారింటికి రోడ్లు వేస్తున్నారని పలుమార్లు విమర్శిస్తుంటే నియోజకవర్గ నాయకులు చప్పట్లు కొట్టడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి హరీష్ రావుకు కేటీఆర్ కు ఇష్టంలేకనే పలుమార్లు ఆమనగల్,కడ్తాల్ మండలాల్లో సమావేశాలు పెట్టి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. ధర్నాలు ఉద్యమాలు చేస్తే అరెస్టు చేస్తున్నారని దెయ్యాలు వేదాలు వెల్లించినట్టు గతంలో ధర్నా చౌక్ ఎత్తేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదనీ అన్నారు. అంబేద్కర్ గురించి మాట్లాడుతూ గొప్ప గొప్ప విషయాలు చెప్పడం కాకుండా గతంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేస్తామనీ అన్నది మీరూ కదా అని విమర్శించారు. హెచ్ సి యు భూములు ముమ్మాటికి ప్రభుత్వానిదేని అది ప్రజల సొమ్మని కోర్టులో కొట్లాడి రేవంత్ రెడ్డి ప్రజల కోసం ఏదో చేయాలని తలుస్తుంటే బీఆర్ఎస్ నాయకులు విద్యార్థులను రెచ్చగొట్టి తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. గతంలో ఏనాడు దక్షిణ తెలంగాణ వైపు చూడని నాయకులు, ఉత్తర తెలంగాణను మాత్రం అభివృద్ధి చేసిన నాయకులు ఈరోజు దక్షిణ తెలంగాణ అభివృద్ధిని చూసి అడ్డుకట్ట వేస్తుంటే ప్రజలు సహించలేకపోతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డిని గన్ మెన్ లేకుండా వచ్చి చూడు అని అనడానికీ సిగ్గుండాలన్నారు.మేము ఈ వేదిక నుండి బీఆర్ఎస్ శ్రేణులకు హరీష్ రావుకు హెచ్చరిస్తున్నాం. ఈ ప్రాంత ప్రజలు రేవంత్ రెడ్డికి పూలతో స్వాగతం పలుకుతారు. మా ప్రాంత అభివృద్ధి ప్రదాత శ్రీ రేవంత్ రెడ్డిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారన్నారు. మిగులు బడ్జెట్ తో తెచ్చుకున్న రాష్ట్రాన్ని 7 లక్ష రూపాయల పైచిలుకు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలుతీసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. ఈరోజు రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం నెలకు 6500 కోట్ల రూపాయలు అసలు మిత్తి కడుతున్నారన్నారు. కాలేశ్వరం పేరుతో అప్పులు చేసి నీళ్లలో పోసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈరోజు ఆ ప్రాజెక్టు దేనికి పనికి లేకుండా పోయిందన్నారు. బతుకమ్మ చీరల పేరుతోటి కమిషన్లు కక్కుర్తి పడ్డ ఘనత టీఆర్ఎస్ పార్టీదే అన్నారు. ఔటర్ రింగ్ రోడ్ సైతం వదలకుండా అడ్వాన్స్ 30 సంవత్సరాలకు అమ్మిన చరిత్ర టిఆర్ఎస్ నాయకులది అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో శ్రీ రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా సంక్షేమ పాలన నడుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు అశోక్, మండల యూత్ అధ్యక్షుడు బోస్ రవి, మల్లేష్ గౌడ్, రామచందర్ నాయక్, మంకీ శ్రీను, శంకర్ నాయక్, భానుకిరణ్, శ్రీకాంత్, తులసీ రాం, బుచ్చయ్య, శ్రీను, కృష్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

# సోనియా, రాహుల్ గాంధీ లతో ప్రత్యేకంగా మాట్లాడిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాంగ్రెస్ అధినేతలు సోనియాగాంధీ రాహుల్ గాంధీ లను గురువారం టీ కాంగ్రెస్ నేతలు ప్రత్యేకంగా కలుసుకున్నారు. టీ కాంగ్రెస్ నేతల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు ఉదయం కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ లను కలుసుకొని వారిని పలకరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కొండా సురేఖ అదేవిధంగా షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తదితర ఎమ్మెల్యేలు ఎంపీలు ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కరాచలనం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ సోనియా గాంధీలు తెలంగాణ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ అభివృద్ధిపై పలువురాలను అడిగి తెలుసుకున్నారు.





# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో రాష్ట్రం ఆగం ఆగం





## -మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

**కడ్తాల్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ సుభిక్షంగా ప్రశాంతంగా ఉండేదని ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో రాష్ట్రమంతా ఆగమాగం.. సగం సగం పాలన కొనసాగుతుందని మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. కడ్తాల్ మండలంలోని బోయిని గుట్ట తండాలో జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, గిరిజనుల ఆరాధ్య దైవం గురువు సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాలను మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎర్రోళ్ల శ్రీనివాస్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం తాండ సమీపంలో మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీష్ రావు మాట్లాడుతూ బీసీలకు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ ఢిల్లీలో నిర్వహించిన మహా ధర్నాకు పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముఖం చాటేసారని తమ నాయకుడు రాహుల్ గాంధీని ఒప్పించలేని రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇప్పించడానికి కేంద్రాన్ని ఎలా ఒప్పిస్తాడని హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కి తిట్లు తప్ప



పనికి వచ్చే మాటలేవి మాట్లాడడం లేదని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో అసెంబ్లీ బయట అబద్ధాలు తప్ప నిజం ఎప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడారని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ భూములు హెచ్ సి యు యూనివర్సిటీకి చెందిన భూములు అమ్ముకునేందుకు సీఎం అయ్యారా అని ప్రశ్నించారు. యూనివర్సిటీ ఆవరణలో ఉన్న పచ్చని చెట్లను నరకడం ఏమిటి అని ప్రశ్నించారు. మూసి రివర్ సుందరీకరణ పేరుతో పేదవారి ఇండ్లను కూల్చడం తప్ప అభివృద్ధి ఎక్కడ కనిపించడం లేదన్నారు. ఫోర్త్ సిటీ ఎవరికోసం నిర్మిస్తున్నారో ఎవరి లాభం కోసం ఇదంతా చేస్తున్నావని ప్రశ్నించారు. ఏడాదిన్నర పాలనలో రేవంత్ రెడ్డి కుటుంబం ఆదాయం పెరిగింది తప్ప పేదల ఆదాయం ఏమాత్రం పెరగలేదని ఆయన అన్నారు. రాష్ట్రంలో లూటీ లేదా లాటి రాజ్యం నడుస్తుందని విమర్శించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి రావడానికి ఒక్క మైసిగండి మైసమ్మ తప్ప అన్ని కులాలకు చెందిన దేవుళ్లపై ఒట్టు పెట్టారని హరీష్ రావు అన్నారు. గిరిజనులకు బంజారా భవన్ 500 జనాభా కలిగిన గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్ దే నని అన్నారు. ఎస్టీలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించారని బంజర హిల్స్ లో బంజారా భవన్ కట్టించారన్నారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా జరిపిన ఘనత కేసీఆర్ దే అన్నారు. రాష్ట్రంలో గిరిజనులకు ఒక్క మంత్రి కూడా లేదని ఎద్దేవా చేశారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రైతన్నలకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని సగం మందికే చేశారని గుర్తు చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా తులం బంగారం కోసం నిరుపేద మహిళలు ఎదురుచూస్తున్నారని రైతుబంధు బంద్అయిందని గుర్తు చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ పేటలో మహిళపై జరిగిన అత్యాచారం చాలా బాధాకరమైన విషయమని ప్రజా పాలనలో ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు ఎక్కడ రక్షణ ఉందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా, డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, వై సత్యం, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కంబల పరమేష్, మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, గౌని లాలయ్య గౌడ్, విజితా రెడ్డి, లచ్చి రామ్ నాయక్, నరసింహ, సి ఎల్ శ్రీనివాస్ యాదవ్, నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, జోగు వీరయ్య, అంజియా నాయక్, లాయఖ్ అలీ, పరమేష్, వినోద్, కరాటే రాజు, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంపాల్ నాయక్, గోపాల్, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు ఇద్దరు మృతి



**అచ్చంపేట, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో అకాల వర్షాలు, పిడుగులు, మెరుపుల కారణంగా ప్రకృతి వైపరీత్యం తన ప్రభావాన్ని చూపింది. నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది, పిడుగు పడటం వల్ల ఇద్దరు దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయారు, మరియు మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు.
పదుర మండలంలోని కోడోనిపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం కండ్లగుట్ట సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వేరుశనగ పంట పొలాల్లో కూలీ పనులు చేస్తున్న సుంకరి సైదమ్మ, వీరయ్య అనే కూలీలు పిడుగు ప్రభావంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సుంకరి లక్ష్మమ్మకు తీవ్ర గాయాలు కావడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

# నరేంద్ర మోడీ చిత్ర పటాన్ని ప్రతి రేషన్ షాప్ ముందు పెట్టాలి

## - కల్వకుర్తి బిజెపి పట్టణ అధ్యక్షులు బాబిదేవ్.

**కల్వకుర్తి, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డ్ సిలార్ పల్లి రేషన్ షాపు నందు సన్న బియ్యం పంపిణీ పథకం బిజెపి నాయకులు ప్రారంభించి ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా కల్వకుర్తి బీజేపీ పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబీదేవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉగాదికి ప్రారంభించిన 6 కేజీల సన్న బియ్యం పథకంలో ఐదు కేజీలు కేంద్ర ప్రభుత్వం వాటా ఇస్తుందని కిలో బియ్యం రాష్ట్ర ప్రభుత్వం వాటా



సరఫరా చేస్తుందని అందుకు తెలంగాణ లో ఉన్న ప్రతి రేషన్ షాప్ నందు భారత ప్రధాని మోడీ గారి ఫోటో (ప్లెక్సీ)లను పెట్టాలని అందుకు అనుకూలంగా కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎమ్మార్వో లు, రేషన్ డీలర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు .లేనియెడల ప్రతి ఊరు ఊరు తిరిగి ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క మోసాలను బట్టబయలు చేస్తామని వారు హెచ్చరించారు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం ప్రతి పేద కుటుంబానికి చేరాలని పక్కదారి పట్టకుండా చూడాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు నీరుకంటి రాఘవేంద్ర గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బృంగి వివేకానంద, మాజీ అధ్యక్షులు బోడ నరసింహ, గంగాధర్ చారి, బీజేవైఎం జిల్లా సెక్రటరీ ధన్నోజ్ నరేష్ చారి మరియు శ్రీకాంత్ పర్వతాలు, నాప శివ తదితరులు పాల్గొన్నారు.

# చారకొండలో సన్న బియ్యం పథకం ప్రారంభించిన కేవీఎన్ రెడ్డి

**చారకొండ, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
చారకొండ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం వైభవంగా ప్రారంభించబడింది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవీయన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పథకాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా కెవీయన్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధమైన సన్న బియ్యం పథకాన్ని అమలు చేయడం విశేషమని కొనియాడారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమాజంలోని అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొని ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని, బడుగు బలహీన వర్గాలకు ఇది గొప్ప వరప్రసాదమని పేర్కొన్నారు. ఈ పథకం రాష్ట్ర ప్రజల ఆకలిని నివారించడంతో పాటు ఆహార భద్రతను నిర్ధారించడంలో కీలకంగా నిలుస్తుందని వివరించారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా సింగిల్ విండో



చైర్మన్ మరియు మండల అధ్యక్షుడు బలరాం గౌడ్, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశినేని పండితరావు, మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి. మహేందర్ రమేష్, డిటి రాఘవేందర్ రెడ్డి, సిపిఎం నాయకులు అశోక్ వంటి పలువురు ముఖ్య నాయకులు హాజరై పథకానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జ కొండల్, కిసాన్ సెల్ వెంకటరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ గణేష్ గౌడ్, పానుగంటి అంజయ్య, గుండె శివ, కుకుడాల శీను, రామకృష్ణ, సత్తార్, జెసిబి వెంకటయ్య, వేముల రవి, కందికంటి కిరణ్, రాము, ఎల్లయ్య, నరేంద్ర, డాక్టర్ శ్రీను, డాక్టర్ సత్యం, గోరేటి శివ, డైరెక్టర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పథకం ప్రారంభించిన కెవీయన్ రెడ్డి

**ఉప్పునుంతల, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



ఉప్పునుంతల మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవీయన్ రెడ్డి పథకాన్ని ఆరంభిస్తూ, ఇది దేశంలోనే గర్వించదగిన పథకమని హర్షించారు. తన ప్రసంగంలో కెవీయన్ రెడ్డి మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి బహుదా అంకితభావంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందిస్తూ, వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ఇది కీలకమని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు విశేషంగా ప్రశంసిస్తున్నారని, ఈ పథకంతో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్ఓ కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశినేని పండిత్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ రమేష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శీను, గ్రామ ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.